# గులాబి

## పి.ఎం. సుందరరావు

నాకిష్టమైన గులాబి మొక్కవంక అలాగే చూస్తుండిపోయాను. అలా రోజూ సాయంత్రం వేళ ఫేము కుర్చీలో కూర్చుని వసారా గోడమీద ఉన్న కుండీలోని గులాబి వంక చూస్తుండటం నాకు అలవాటు. అది తప్ప వేరే మొక్కలు లేవా అంటే ఉన్నాయి. ఒకపక్క గోడమీద కుండీల్లో కనకాంబరాలున్నాయి. గోడకు పక్కగా పందిరివేసి దానికి పాకించిన సన్నజాజి చెట్టుకు పూలు విరగబూసి ఉన్నాయి.

కానీ అవన్నీ నాకు ఇష్టంగా చూడాలనిపించవు. అదిగో ఆ గులాబి వంక చూడటమంటేనే చాల ఇష్టం. పోనీ ఒక్క గులాబీ వంక చూడటం తప్ప, మరే ఇతర ఇష్టాలు లేవా? అంటే ఉన్నాయి. పాత సినిమాలు చూడటమంటే ఇష్టం. ఘంటసాల గానమంటే ఇష్టం. ఆత్రేయ పాటలంటే ఇష్టం. చలం సాహిత్యమంటే ఇష్టం.

ముఖ్యంగా రోజూ సాయంత్రంవేళ ఆఫీసు నుంచి వచ్చి, స్నానం చేసి, అలా వసారాలో కూర్చుని అలా గులాబికేసి చూడటం మరీ మరీ ఇష్టం.

అలా గులాబికేసి చూస్తూ నన్ను నేను మర్చిపోతున్న సమయంలో ''గులాబి పువ్వు కోసుకుంటానండి.'' అనే తీయని కంఠం వినిపించి, ఆవైపుకేసి చూసాను.

ఎదురుగా రాణి.

రోజూ అలా ప్రశాంతంగా కూర్చుని నన్ను నేను మర్చిపోతున్న సమయంలో ''గులాబి పువ్వు కోసుకుంటానండీ'' అని అడగటం, నేను సరేనన్నట్టు తల ఊపటంతో, చాలా సున్నితంగా పువ్వును తెంచుకుని పదిలంగా గుండెలకత్తుకుని వెనక్కి తిరిగి నావైపు చూడకుండానే వారింట్లోకి పరుగుతీయటం ప్రతిరోజూ చేస్తున్నపనే.

కానీ ఈరోజు అందుకు భిన్నంగా, ఎదురుగా ఓ ప్లేటుతో నిలబడి ''ఇవి మా అమ్మగారు, మీకిచ్చి రమ్మన్నారండీ! త్వరగా తీసుకోండి. వేడివి తింటే రుచిగా ఉంటాయి.'' అని నా ఎదురుగా ఉన్న స్టూలు మీద, అయిదారు బజ్జీలున్న స్టీలు ప్లేటు పెట్టింది.

నేను ఆశ్చర్యంగా వాటివంక చూస్తుండి పోయాను.

ఎప్పటిలాగానే ''గులాబి పువ్వు కోసుకుంటానండీ'' అని, మొక్కకున్న ఒకే ఒక పువ్వును తెంచుకోబోయేసరికి, పక్కనున్న ముల్లు గుచ్చుకుని ''అమ్మా!'' అంటూ చేతిని వెనక్కి తీసుకుంది.

వెంటనే నేను వెళ్ళి కొద్దిగా రక్తం కారుతున్న ఆవేలిని నోట్లో పెట్టుకుని చప్పరించాను. వెచ్చగా, ఉప్పగా తగిలింది. ''ఛీ!'' అనేసరికి, నేను వేలిని నోటి నుండి వదిలేశాను. భయం, భయంగా పువ్వును తెంచుకోకుండానే వెళ్ళబోయింది. నేను ఆపి, జాగ్రత్తగా గులాబిని తెంచి తన చేతికి అందించాను. గబుక్కున లాక్కుని వేగంగా తమ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

కాస్తంత ఊపిరి పీల్చుకుని యధావిధిగా వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

ప్లేటులోని ఒక బజ్జీని తీసుకుని కొరికాను. పెద్దగా మంటలేదు. వాము ఎక్కువగా దట్టించినట్టుంది. తింటూ ఆలోచించసాగాను.

నేను ఉంటున్న ఈ ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లోనే రాణి ఉండేది. రాణి వాళ్ళ నాన్న పరమేశ్వరం ఓ ప్రైవేటు కంపెనీలో ఎక్కౌంట్సు రాస్తుంటాడు. తల్లి జయంతి కొద్దిపాటి చదువు గలది. ఆవిడకి ఇంటి పనులతోనే సరిపోతుంటుంది. రాణిని బి.ఏ. దాకా చదివించి, ఇక చాల్లేనని ఇంట్లో కూర్చోబెట్టారు.

ఆ ఇంటిని పది సంవత్సరాల క్రితమే కొన్నారు. అటు పెద్దదిగాకుండా, చిన్నది కాకుండా ఉంటుంది ఆ ఇల్లు. ఆ కుటుంబం, ఆవీధిలోని వారందరికంటే భిన్నంగా ఉంటారు. ఒకరి జోలికి వెళ్ళరు. ఎవ్వరినీ ఏమీ ఆశించరు. ఎవ్వరు ఏదడిగినా లేదంటూ, సున్నితంగా తప్పించుకుంటారు. కానీ చెయ్యిజారి ఇచ్చినట్టు కనిపించరు. రాణిని కూడా ఎక్కడికీ పంపించరు. ఇదిగో ఇలా గులాబి పువ్వుకోసం తప్ప.

ఈ విషయాలన్నీ మా ఇంటి ఓనరు కాశీపతి ద్వారా తెలుసుకున్నవే. కాశీపతి దృష్టిలో పరమేశ్వరం ఓ పిసినారి వెధవ. జయంతి అంతకు వందరెట్లు గలది. రాణి ఓ నీరసపు ముండ.

కానీ వారిని చూస్తే నాకు అలా అనిపించదు. వారు తమకు అవసరమైన వరకే ఖర్చు చేసుకుంటారు. అనవసరంగా ఖర్చు పెట్టరు. అంతమాత్రం చేత వారిని పిసినారులు అనటం తగదు. ఇక రాణి విషయానికి వస్తే, అనవసరంగా మాట్లాడదు.

కాశీపతి మానవుల అవసరాలను ఆసరా చేసుకుని డబ్బులిచ్చి, అధిక వడ్డీలు గుంజే పనులు చేస్తుంటాడు. అందరిని ఎవరో ఒకరి ముందు ఆడిపోసుకోవటం అతని ప్రవృత్తి. అతని ఏకైక కూతురు రమ. ప్రపంచంలోని అనాకారితనాన్ని అంతా కుమ్మరించినట్లుండే ఆకారం. ఆ అనాకారిని మొగుడనే ఓ జడ పదార్థం, తన ఇంట్లోనే వడ్డీ లెక్కలు చూసే క్యాలిక్యులేటర్ కోసం అన్వేషణ సాగిస్తున్నాడు. ఆ మహానుభావుడి దృష్టిలో నేను కూడా ఉన్నానని వేరేవారి ద్వారా తెలిసింది. నాతో కూడా, ఆ విషయాన్ని ప్రస్తావించబోయి, మానుకున్నట్టు నాకు గుర్తే.

నాకు తెలియకుండానే, ఆలోచనల్లో ఉండగానే ప్లేటులోని బజ్జీలన్నీ అయిపోయాయి. ప్లేటును ఇంట్లోకి తీసుకెళ్ళి సింక్ పక్కనగల బక్కెట్‌లో పడేసి, కూజాలోని మంచినీళ్ళు తాగి వచ్చి, వసారాలోని కుర్చీలో కూర్చున్నాను.

నామనసు రాణివైపు మళ్ళింది. రాణి సహజ సౌందర్యవతి. లేనిపోని అలంకరణలకు తావివ్వదు. చూడముచ్చటగా ఉంటుంది అనవచ్చు.

ఎప్పుడూ లేనిది ఈరోజిలా, ఈ బజ్జీల ప్లేటుతో రావటమే ఆశ్చర్యంగా ఉంది. ఆ దంపతులిరువురూ ఎందుకోసం ఇలా పంపించారు. నానుంచి ఏం ఆశిస్తున్నారు. కొందరి విషయంలోనైతే ఇంతగా ఆలోచించాల్సిన అవసరంలేదు. కాని ఆ పరమేశ్వరం జయంతి బుద్ధుల్నిబట్టి, ఇంతగా

ఆలోచించాల్సి వస్తుంది.


ఏమో తమకు ఉన్నదానిని, తాము చేసుకున్నదానిని నలుగురితో కాకపోయినా, మరొకరితోనైనా పంచుకుని ఆనందిం చుదామనుకున్నారేమో. బహుశా! అది ఈరోజునుంచే ప్రారంభమైందేమో!

కానీ ఈ సమాధానం నామనసును బుజ్జగించలేక పోయింది.

ఇలా అనేకానేక ఆలోచనలతో సతమతమవు తుండగానే, పూ ర్తిగా చీకటి ఆవరించింది.

మరుసటిరోజు సాయంత్రం కూడా అలా గులాబి మొక్కకేసి చూస్తూ కూర్చున్నాను.

ఇంతలోనే వచ్చాడు కాశీ పతి.



లోపలి నుంచి మరో కుర్చీ తీసుకువచ్చి, వేసి కూర్చోమన్న ట్టు చూసాను.

ఇష్టం లేన ట్టుగానే కూర్చు న్నాడు ఆకుర్చీలో. ఆము ఖాన్ని చూస్తే ఏదో పోగొట్టు కున్నవాడిలాగా అనిపించింది. కొంపదీసి ఏబాకీదారుడో చెప్పా పెట్టకుండా బాకీ చెల్లింపకుండా, ఊరొదిలి పారిపోయాడేమో అనుకున్నాను.

అదేం కాదనట్టు నోరు తెరచి ''నీకు తెలిసే ఉంటుంది కదా! మీ అమ్మగారు మొన్న ఇక్కడ్నుంచి వెళుతూ, వెళుతూ ఆ పరమేశ్వరంకి జయంతికి, ''కట్నం తక్కువైనా ఫరవాలేదు. బంగారపు బొమ్మలాంటి మీ రాణిని మా ఆనందరావుకి తప్పకుండా చేసుకుంటాను. వచ్చేవారంలో ఇక్కడకొస్తాను. అప్పుడే మాట్లాడుకుని, లగ్గాలు కూడా పెట్టుకుందామని చెప్పిందట కదా! నిజంగా పరమేశ్వరం, జయంతి దంపతులు ఘటికులేనయ్యా. ఒక్కగానొక్క కొడుకివి. మంచి ఉద్యోగం. రేపో, మాపో నాలుగు లక్షల దాకా ఏదో ఆస్తి వచ్చే అవకాశం ఉందట. అందుకే నిన్నుగాకుండా మీ అమ్మను పట్టుకున్నారు. చూద్దాం!'' ఈ పెళ్ళి జరుగుతుందో, లేదో అన్నట్టు చూసి వెంటనే వెళ్ళిపోయాడు.

ఓహో! అదా సంగతి! అందుకేనన్నమాట. నిన్న బజ్జీల ప్లేటుతో వచ్చింది.

అవునూ, అమ్మ నాకు ఈ విషయం చెప్పకుండా వెళ్ళిపోయిందేంటి?

అమ్మమీద నాకు విపరీతమైన ప్రేమ. నామీద కూడా అమ్మకు మరింత ప్రేమ. అమ్మ ప్రేమ నాకు ఒక్కోసారి విసుగు, చిరాకును కలిగిస్తుంది. ఒక్కోసారి అమ్మ, నన్ను సొంత వ్యక్తిత్వం లేనివాడిగా చూస్తుంది. అమ్మకోసం, నన్ను-నేను, ఆమె ఇష్టరీత్యా మలచుకోవటం, ఆమె అభిప్రాయరీత్యా ప్రవర్తించటం చేస్తాను.

కానీ పెళ్ళి విషయంలో కూడా అమ్మ నా అభిప్రాయం తెలుసుకోకపోవటం కొంచెం బాధ కలిగించింది. అమ్మకు నేనెప్పుడూ చిన్న పిల్లాడినే. నాకు ఏది కావాలో, అది చేయటానికే తను ఉన్నట్టు పదే పదే చెబుతుంటుంది.

ఇప్పుడీ పెళ్ళి విషయంలో కూడా అదే అభిప్రాయంతో ఉన్నట్టుంది.

రాణి మీద నాకు దురభిప్రాయంలేదు. ఆమె క్యారెక్టర్ చెడ్డది కాదు. మరి అలాంటప్పుడు అమ్మ అభిప్రాయాన్ని తప్పుపట్టాల్సిన అవసరమేముంది. నాకు నచ్చని అమ్మాయి అయితే కదా నేను బాధ పడాల్సింది.

నాలుగు రోజుల తర్వాత అమ్మ వచ్చింది. విషయం వివరించింది.

రాణి మీద సదభిప్రాయమే ఉంది కాబట్టి, నేను అంగీకారం తెలిపిన వెంటనే ముహూర్తం నిర్ణయించారు. నేను పెళ్ళి పేర ఆడంబరాలు, విలాసాలకు ఖర్చు చేయటం ఇష్టంలేదని చెప్పటంతో, వారు కూడా సంతోషించి నిర్ణయాన్ని ఆమోదించి, పెళ్ళి సింపుల్‌గా జరగటానికి ఇష్టపడ్డారు.


పెళ్ళి రెండు వారాలే ఉండటంతో, ఆ పనులన్నీ చూడాలని అమ్మ ఎప్పటిలా, మా స్వంత ఊరు వెళ్ళిపోయింది.

ఇరుపక్షాలవారం చెప్పకపోయినా చాలామందికి పెళ్ళి విషయం తెలిసిపోయింది. అయినా ఫరవాలేదనిపించింది. ఇప్పుడు కాకపోయినా రేపైనా తెలుస్తుంది కాబట్టి, ఇతరుల నుంచి కొన్ని కొన్ని ఫుల్లవిరుపు మాటలు, అవహేళనలు వినవలసి

వస్తుంది. ఎంత కాదనుకున్నా అవి బాధను కలిగిస్తూనే ఉన్నాయి.

కాశీపతి తనకు క్యాలిక్యులేటర్ కాకుండా తప్పించుకుంటున్నానని, ఏవేవో వాగుతున్నాడు. నేనేమీ పట్టించుకోదలచుకోలేదు.

నేను సాయంత్రంవేళ కుర్చీలో కూర్చుని ఉన్నప్పుడల్లా ''గులాబి పువ్వు కోసుకుంటానండీ!'' అని యధావిధిగా పువ్వు తెంచుకు వెళుతూనే ఉంది. అలాంటి సమయంలో చూసిన ఇరుగు పొరుగువారు చెవులు కొరుక్కోవటం నేను గమనించాను. రాణి కూడా గమనించినా ఆ ముఖంలో ఏ భావం వ్యక్తం కావటంలేదు.




నాకు ఒక విషయం కొంచెం ఆశ్చర్యం కలిగించింది. రాణి ఇంతకు ముందు ఎలా ప్రవర్తించేదో, ఇప్పుడు కూడా అలానే ప్రవర్తిస్తుంది. ముఖ్యంగా నన్ను చూసినప్పుడు కూడా.

కట్టుకునేవాడిని చూడగానే ఆడపిల్లలో కలిగే సిగ్గు, బిడియం లాంటివి కనిపించేవి కావు. కానీ అంతలోనే ఆడపిల్లల్లో మాత్రమే అవి ఉండాల్సిన అవసరమేముంది- అనిపించింది మనసులో.

ఇలా దాదాపుగా రాణి గురించిన ఆలోచనలతో, ఇద్దరూ కలిసి జీవించబోయే భవిష్యత్తును తలచుకుంటూ వారం రోజులు గడిచిపోయాయి.

★ ★ ★

అన్నీ మనం అనుకున్నట్టు జరిగితే కాలం యొక్క మహిమ ఏముంటుంది. అందుకే తన ఉనికిని చాటుకోటానికి కాబోలు కాలం మనం అనుకున్నట్టు కాకుండా, వ్యతిరేకంగా తన కార్యాన్ని నిర్వర్తిస్తుంటుంది. అలానే జరిగింది ఇప్పుడు.

చట్టంలోని లొసుగులవల్ల, తప్పుడు సాక్ష్యాలవల్ల, మాకు రావలసిన దాదాపు నాలుగు లక్షల రూపాయల ఆస్తి రాకుండా, ప్రత్యర్థికి పోయింది దావాలో. ఇప్పుడు చెప్పాలంటే నాకు ఉద్యోగం తప్ప, ఏ ఇతర ఆస్తిపాస్తులు లేవు. ఈ విషయం చెప్పి, అమ్మ బాధగా, నావద్ద నుంచి రెండు రోజుల క్రితమే వెళ్ళి పోయింది. నేను ఎంత కాదనుకున్నా, ఈ విషయం లోలోపల మంటను రేపుతూనే ఉంది. ఆ సమయంలో ఎవరైనా వచ్చి ఓదార్చితే బాగుండుననిపించింది.

రెండు రోజుల నుంచి రాణి కూడా గులాబి కోసం రావటంలేదు. అసలు వారి వసారాలో కూడా కనిపించటం లేదు. జయంతి, పరమేశ్వరంలు నన్ను చూసి, ఎవరో కొత్త వ్యక్తిని చూసినట్లు తలవంచుకుంటున్నారు. అదే అర్థంగాని పరిస్థితి. కొంచెం బాధించిన పరిస్థితి. బహుశా ఈ విషయం వారికి తెలియలేదా! అమ్మ చెప్పకుండా ఉంటుందా!

అదేం కాదన్నట్టు వసారాలో ఫేము కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న నా దగ్గరకు కాశీపతి వచ్చి, ఎదురుగా ఉన్న స్టూలు మీద కూర్చుని, చాలా ఆనందంగానే అసలు విషయం చెప్పి వెళ్ళిపోయాడు. నీకు ఇలాగే జరగాలన్నట్టు చూస్తూ.

ఆ విషయం వినగానే మొదట నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఏం! ఉద్యోగం తప్ప ఇతర ఆస్తి వచ్చే అవకాశం లేనందువల్ల, నేను రాణికి తగిన వరుడ్ని కాదా! అందుకని అదే ముహూర్తానికి అయిదు లక్షల ఆస్తి, పైసంపాదన బాగా ఉన్న రెవెన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తున్న మరోవ్యక్తికి కట్టబెట్టడమా.

మొట్టమొదటిసారిగా జయంతి, పరమేశ్వరంలు చాలా వికృతంగా కనిపించారు నా కళ్ళకు. లేకపోతే ఏంటి? ఆస్తి రాదని తెలియగానే, నాకు తిరుగుబోతు, అనే నెపం చేర్చి నన్ను కాదని మరో వ్యక్తికిచ్చి పెళ్ళి చేయడమేంటి.

పాపం! రాణిది మాత్రం ఏ తప్పులేద నిపిస్తుంది. ఎందుకంటే రాణి సగటు ఆడపిల్లని నా అభిప్రాయం. అందరిలాగా తల్లిదండ్రులు చూపించినవాడి ముందు తలవంచి తాళి కట్టించుకునే బాపతుగల ది.

చీకటి ఆవరిస్తుండటంతో పరిసరాలు మసకబారి కనిపిస్తున్నాయి. కాని కుండీలోని గులాబి మాత్రం నాకంటికి స్పష్టంగా కనిపిస్తుంది.

ఆశ్చర్యం! నా కళ్ళను నేనే నమ్మలేని స్థితి.

ఎదురుగా రాణి వచ్చి నిలబడింది. రెండు రోజులుగా రానిది ఈరోజు ఎందుకొచ్చినట్టు! అర్థంగాని గందరగోళం, 'ఎన్నెన్నో అనుమానాలు.'

నోరు తెరిచింది. కానీ 'గులాబి పువ్వు కోసుకుంటానండీ!' అనలేదు.

''ఆనంద్‌గారు! ఈ రెండు రోజులు బాగా ఆలోచించాను. మన పెళ్ళి విషయంలో నా తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం నాకు నచ్చలేదు. నాలో పెళ్ళి అనే ఆలోచన కలిగించింది మీ రూపాన్ని చూపించే. ఇప్పుడు నా మనసులో ముద్రితమైన మీ రూపాన్ని చెరిపేసుకోలేను. అందుకే మిమ్మల్నే చేసుకోవాలని నేను నిర్ణయించు కున్నాను. నా తల్లిదండ్రుల నిర్ణయం తో నాకిక పనిలేదు. మీరు ఎక్కడికి రమ్మన్నా, రావటానికి నేను సిద్ధమే.'' అంది.


ఆమాటలు వినేసరికి నాకు చాలా ఆశ్చర్యమేసింది. రాణి సగటు ఆడపిల్ల కాదనిపించింది. కండీలోని గులాబి లాగా, స్పష్టంగా కనిపిస్తుంది రాణి ఆ చీకటిలో కూడా.

నా చిన్నప్పుడు రెండోతరగతి పుస్తకంలో చదివినట్టు గుర్తు.

పూవులలోకెల్ల రాణి పువ్వు గులాబి పువ్వు. అలాగే రాణి కూడా.

వెళ్ళి గులాబి పువ్వును తెంచి ఆమె చేతికందించి దగ్గరకు తీసుకున్నాను.

★



## నాగ్ వర్సెస్ సాజిద్

ప్రస్తుతానికి టాబూకి కాబోయే మొగుడుగా పిలవబడుతున్న సాజిద్ నడియావాలా ఈమధ్య బంధుమిత్ర సపరివారం ముందు తెలుగు హీరో నాగార్జున మీద కోపం ప్రదర్శిస్తున్నాడని వినికిడి. సాజిద్‌కి నాగార్జున మీద కోపం ఎందుకు?! నిర్మాతయిన సాజిద్‌కి నాగార్జున కాల్‌షీట్స్ ఇవ్వనన్నాడా?...లేదు! పోనీ 'టాబూ'ని బుట్టలో వేసుకున్నాడా?!...కాదు! మరెందుకు కోపం?!...నాగార్జున ఆమధ్య టాబూకి ఓ సలహా యిచ్చాడట! 'అవకాశాలొస్తున్నప్పుడు పెళ్లి చేసుకోవడం బుద్ధితక్కువ పని. పెళ్లితోనే హీరోయిన్ కెరీర్ అంతమయిపోతుంది' అని! అదే సమయంలో 'మాచిస్' హిందీ చిత్రంలో ఆమెకు జాతీయ అవార్డ్ రావడం, 'నిన్నే పెళ్లాడతా', 'ప్రేమదేశం' హిట్స్‌తో ఆఫర్స్ వచ్చిపడుతుండడంతో, మిత్రుడు 'నాగ్' సలహామేరకు పెళ్లి ప్రపోజల్ పక్కన పెట్టింది...తన పెళ్లి వాయిదాపడేలా చేసిన వ్యక్తిమీద ఏ మొగాడికైనా కోపం రాదా?! అదండీ సాజిద్ వర్సెస్ నాగ్ కథాకమామీషూ!

-జె.వి.బాబు